క్లుప్తంగా

సాంకేతిక, శాస్త్రీయ రంగాల్లో ప్రగతి సాధించాలి



మాట్లాడుతున్న జిల్లా న్యాయవాది నాగలక్ష్మీదేవి

నందికొట్కూరు: సాంకేతిక శాస్త్రీయ రంగాల్లో మహిళలు ప్రగతి సాధించాలని కర్నూలు జిల్లా న్యాయవాది నాగలక్ష్మీదేవి అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ సునీత ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళలు ధైర్యంగా ముందుకెళ్తే అభివృద్ధి మార్గంలోకి రాణించవచ్చని చెప్పారు. న్యాయపరంగా మహిళలకు చట్టాలపై అవగాహన ఎంతో అవసరమని తెలిపారు. ఆశయాన్ని నెరవేర్చకోవడంలో మహిళలు వెనకాడకూడదన్నారు. కార్యక్రమంలో ఆలయన్స్ క్లబ్ జిల్లా సెక్రటరీ డాక్టర్ నైలా తబస్సుం, మున్సిపల్ మేనేజర్ బేబి, అధ్యాపకులు అమరావతి, ఝాన్సీరాణి, చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

నంద్యాల: పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను సీరియస్‌గా తీసుకోవాలని, నోడల్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియపై నోడల్ అధికారులతో జాయింట్ కలెక్టర్ నిశాంతి, డీఆర్‌ఓ పుల్లయ్యతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీ జరిగే పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌లో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పకడ్బందీగా నిర్వహించేందుకు సంబంధిత నోడల్ అధికారులు పూర్తి స్థాయి బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఓటర్లకు ఓటర్ స్లిప్ లు బుధవారం సాయంత్రంలోగా వంద శాతం పంపిణీ చేయాలని ఆదేశించారు.

పోలింగ్‌బూత్‌ల పరిశీలన


పోలింగ్‌బూత్‌లను పరిశీలిస్తున్న సెక్టోరియల్ అధికారి, మండల తహసీల్దార్

శ్రీశైలంప్రాజెక్ట్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలు ఈ నెల 13 వ తేదిన జరగనున్నాయి. సున్నిపెంటలోని ప్రభుత్వ ప్రాజెక్ట్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను మంగళవారం సెక్టోరియల్ అధికారి జి.శ్రీనివాసులు, మండల తహసీల్దార్ రాజేంద్రసింగ్ పరిశీలించారు.

నందికొట్కూరు: ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు త్వరగా పూర్తి చేస్తామని తహసీల్దార్ రాజశేఖర్‌బాబు అన్నారు. మంగళవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పట్టుభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్, టౌన్ సీఐ విజయభాస్కర్ పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. టౌన్ సీఐ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచుతామని చెప్పారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు


అయ్యప్పస్వామి ఆలయంలో మూల విరాట్‌కు పూజలు చేస్తున్న భక్తులు

నందికొట్కూరు: పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో మూల విరాట్‌ను మంగళవారం భక్తులు దర్శించుకున్నారు. మూల విరాట్‌కు భక్తులు అభిషేకాలు, హోమాలు, విశేష పూజలు చేశారు. పూజ కార్యక్రమంలో భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల గుర్తింపు

మిడుతూరు: మండల కేంద్రమైన మిడుతూరుతో పాటు జలకనూరు, పైపాలెం, అలగనూరు, వీపనగండ్ల గ్రామాలలో ఖాళీగా ఉన్న వార్డు మెంబర్ల ఎన్నికకు పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్లు ఎంపీడీఓ జీఎస్‌ఎస్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల వివరాలను ప్రకటించారు. మిడుతూరులో 13వ వార్డు, వీపనగండ్ల 3వ వార్డు , జలకనూరు 8వ వార్డు, అలగనూరు 10వ వార్డు, పైపాలెం 5వ వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఓర్పునకు నిర్వచనం..

సాధికారతకు నిదర్శనం

మహిళా దినోత్సవం

- అన్నిరంగాల్లో రాణిస్తున్న మహిళలు
- మనోధైర్యంతో పురుషులకు దీటుగా ముందుకు..
- ఆర్థిక సాధికారత వైపు అడుగులు

ఆత్మకూరు: నేటి మహిళలు మహారాణులు అనే విధంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతూ ఆర్థిక సాధికారతను సాధిస్తున్నారు. ఒకప్పుడు వంటగదికే పరిమితమైన మహిళ అబలకాదు సబల అని నిరూపించింది. మహిళలు మనో ధైర్యంతో పురుషులకు దీటుగా అన్ని రంగాల్లో రాణిస్తూ శభాష్ అనిపిస్తున్నారు. రాజకీయ, ఆర్థిక, విద్యా, వైద్య రంగాల్లో దూసుకుపోతున్నారు. ఉన్నత చదువులతో పాటు ఎలాంటి చదువులు లేని వారు కూడా ముందుకు అడుగులువేస్తూ ప్రగతి సాధిస్తున్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం .

మనో ధైర్యమే ఆమె బలం..

కరివేన గ్రామానికి చెందిన రమాదేవికి ఇద్దరు పిల్లలు. ఒక కొడుకు, ఒక కూతురు. ఐదేళ్ల క్రితం భర్త చనిపోవడంతో చిన్నపిల్లలతో ఎంతో ఇబ్బంది పడింది. ఎలాగైనా నిలదొక్కుకుని పిల్లల భవిష్యత్తును బంగారు బాటగా తీర్చిదిద్దాలని భావించింది. ఈ తరుణంలో పొదుపు మహిళా సంఘంలో సభ్యురాలిగా చేరగా తొలిసారి కేవలం రూ.20 వేల మాత్రమే రుణం ఇచ్చారు. దీనితో చిన్న కిరాణా షాపు ఏర్పాటు చేసుకుంది. అనంతరం పొదుపు తో పాటు బ్యాంక్‌లో రుణం రూ.70 వేలు ఇచ్చారు. దీనికితోడు సీఐఎఫ్ కింద రూ.లక్ష తీసుకుని పిండిమిషన్ ఏర్పాటు కుంది. ఆ ఒక్క మిషన్ తో ఉపాధి ప్రారంభమైంది. దినదినాభివృద్ధి చెందుతూ పొదుపు సంఘం నుంచి మరో రూ.లక్ష రుణం తీసుకొని ఐదు పిండి మరలు ఏర్పాటు చేసుంది. పిండి మిషన్లతో పాటు కిరాణా షాపును నిర్వహిస్తోంది. ప్రస్తుతం రోజుకు రూ.4 వేల రూ.5 వేల వరకు సంపాదిస్తోంది. వచ్చిన మొత్తంలో రుణాలు చెల్లించి మిగిలిన మొత్తం పొదుపు చేస్తూ పిల్లలను చదివిస్తోంది. ప్రస్తుతం కూతురును 10వ తరగతి, కొడుకు 7 వ తరగతి చదువుతున్నారు.


పిండిమిషన్ వద్ద రమాదేవి ,కరివేన

వ్యాపారం.. రాజకీయంలో రాణింపు



నిరుపేద కుటుంబంలో జన్మించిన దరగమ్మ నేడు ఆత్మకూరు పట్టణంలో అన్ని రంగాల్లో రాణిస్తూ అందరి మన్నన పొందుతోంది. శారీ సెంటర్ నిర్వహణతో గుర్తింపు పొందింది. దరగమ్మది సిద్దాపురం. 20 ఏళ్లగా ఆత్మకూరులోనే ఉంటోంది. తొలుత ఆర్థిక ఇబ్బందుల కారణంగా పొలం పనులే జీవనాధారంగా కాలం వెళ్లదీసింది. ఆ తరువాత ఆత్మకూరుకు వచ్చి, పొదుపు సంఘంలో చేరింది. మందు చిన్నదుకాణంగా శారీ సెంటర్ ఏర్పాటు చేసింది. ప్రస్తుతం దానితోనే ఆర్థికాభివృద్ధి సాధించి రాణిస్తోంది. అంతే కాకుండా రాజకీయాల్లోనూ అడుపెట్టి అంచలంచెలుగా ఎదుగుతోంది. ప్రస్తుం వైఎస్సార్‌సీపీలో మహిళా విభాగం మండల అధ్యక్షురాలిగా కొనసాగుతూ రాజకీయంగా ఎదుగుతూ ఆత్మకూరులో రాజకీయంగా కూడా గుర్తింపు పొందింది.

సమాజంలో మహిళలు గౌరవింపబడాలి


కొత్తపల్లిలో మహిళా అధికారులను సన్మానించిన దృశ్యం,


4వ తరగతి ఉద్యోగిని లక్ష్మీబాయినిసన్మానిస్తున్న అధ్యాపకులు , విద్యార్థులు

కొత్తపల్లి: ప్రస్తుత సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని, సమాజంలో గౌరవింపబడాలని ఎంపీడీఓ మేరీ తెలిపారు. మంగళవారం మండల కేంద్రమైన కొత్తపల్లిలో ఉన్న మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఏపీఎం పుల్లయ్య అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం పలువురు మహిళా అధికారులను సన్మానించారు.

4వ తరగతి ఉద్యోగినికి సన్మానం

శ్రీశైలంప్రాజెక్ట్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 4వ తరగతి ఉద్యోగిని లక్ష్మీబాయిని అధ్యాపకులు, విద్యార్థులు శాలువా కప్పి సన్మానించారు. కొన్నేళ్లుగా కళాశాలలో లక్ష్మీబాయి విధులు నిర్వర్తిస్తున్నారు. ఆమె సేవలకు గుర్తింపుగా ఆమెకు ఈ గౌరవం దక్కింది. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ జి.చంద్రశేఖర్, అధ్యాపకులు ఢిల్లీ బాబు, మహేశ్వరరెడ్డి, కల్యాణి, ఉన్నూరు సాహెబ్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచండి

జూపాడుబంగ్లా: గ్రామాల్లో వ్యవసాయ పనులు తగ్గినందున అడిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పించి కూలీల సంఖ్య పెంచాలని ఏపీడీ అన్వరాబేగం ఆదేశించారు. మంగళవారం ఆమె మండలంలోని పారుమంచాల, తంగడంచ చెరువులను పరిశీలించారు. చెరువుల్లో నీళ్ల తగ్గిన వెంటనే ఈనెలాఖరులోగా లేదా ఏప్రిల్ మొదటివారంలో చెరువుల్లో అమృత్‌సరోవర్ పథకం కింద పూడికతీత పనులు చేపట్టాలని ఏపీఓ గౌరీబాయి, ఈసీ నజీర్‌అహమ్మద్‌లకు సూచించారు. మండ్లెం చెరువులో నీళ్ల తగ్గినందున అక్కడ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. చెరువుల్లో తీసిన పూడికను రైతులు వారి సొంత ట్రాక్టర్ల ద్వారా ఉచితంగా పొలాలకు తీసుకెళ్లవచ్చని ఏపీడీ వెల్లడించారు. కార్యక్రమంలో పారుమంచాల సర్పంచ్ మాధవరం ప్రకాశం పాల్గొన్నారు.


పారుమంచాల చెరువును పరిశీలిస్తున్న ఏపీడీ అన్వరాబేగం

కూలీల సంఖ్య పెంచాలి

నందికొట్కూరు: ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలని అడిషనల్ ప్రోగ్రామ్ అధికారి భాస్కర్‌నాయుడు ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో జూపాడు బంగ్లా, పగిడ్యాల, నందికొట్కూరు, మిడుతూరు మండలాలకు చెందిన ఉపాధి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మార్చి వరకు ఇచ్చిన టార్గెట్‌ను పూర్తి చేయాలని సూచించారు. ప్రతి ఉపాధి కూలీకి రోజుకు కనీస వేతనం రూ. 240 వచ్చే విధంగా చూడాలన్నారు. సమావేశంలో కోర్స్ డైరెక్టర్ ఏసుదాసు, ఏపీడీ అన్వర్‌బేగం, ఎంపీడీఓ శోభరాణి పాల్గొన్నారు.

ముమ్మరంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

సాక్షి నెట్‌వర్క్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. మంగళవారం నందికొట్కూరు పట్టణంలోని 13, 15వ వార్డుల్లో, 6, 7, 13, 14 సచివాలయాల పరిధిలో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. శ్రీశైలం, నందికొట్కూరు నియోజకవర్గాల్లోని గ్రామగ్రామానా ప్రజాప్రతినిధులు వైఎస్సార్‌సీపీ శ్రేణులు, నాయకులు పట్టభద్రుల ఇళ్ల వద్దకు వెళ్లి రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు.

ఆ ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలి

ఆత్మకూరు: ఉపాధ్యాయ విధులకు డుమ్మాకొట్టి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఒక డాక్టర్‌కు అనుకూలంగా ప్రచారం నిర్వహిస్తున్న ఎనిమిది మంది ఉపాధ్యాయులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు జవహర్‌నాయక్ డిమండ్ చేశారు. పట్టణంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఫేషియల్ అటెండెన్స్ పరిశీలించి వారిపైన శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీన, జిల్లా కలెక్టర్, విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తానని చెప్పారు.

ఎమ్మెల్సీ ఓటుపై అవగాహన తప్పనిసరి

మిడుతూరు: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్ విధానంపై అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీఓ జీఎస్‌ఎస్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఓటింగ్ విధానంపై ఎంపీటీసీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ శాసనమండలి ఎన్నికలలో ఓటింగ్, సాధారణ ఎన్నికలకు భిన్నంగా ఉంటుందని చెప్పారు. ఇక్కడ పోటీలో ఉన్నవారికి ప్రాధాన్యత ఓటు వేయవచ్చు. శాసనసభ ఎన్నికల మాదిరిగా పార్టీల గుర్తులు, ఎలక్ట్రానిక్ మెషిన్లు ఉండవని, బాలెట్ పేపర్ మాత్రమే ఉంటుందని చెప్పారు. అందులో అభ్యర్థి పేరు పోటో ఉంటాయని తెలిపారు. వాటికి ఎదురుగా ఉన్న గదుల్లో ప్రాధాన్యత ఓటు వేసు కోవాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ ఫక్రుద్దీన్, ఏఓ దశరథరామయ్య తదితరులు పాల్గొన్నారు.

తాటిపాడుకు విద్యార్థి బస్సు

జూపాడుబంగ్లా: బస్సుసౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థుల సౌకర్యార్థం నందికొట్కూరు ఆర్టీసి డిపో మేనేజర్ నాగేశ్వరరావు తరిగోపుల, తాటిపాడు, జూపాడుబంగ్లా, తంగడంచ, మండ్లెం గ్రామాల మీదుగా నందికొట్కూరుకు విద్యార్థి బస్సు ఏర్పాటు చేశారు. ఉదయం 7.45 గంటలకు తరిగోపులలో బస్సు బయలుదేరి తాటిపాడు, తంగడంచ, మండ్లెం గ్రామాల మీదుగా నందికొట్కూరు చేరుకుంటుంది. సాయంత్రం 4.45గంటలకు నందికొట్కూరు నుంచి బయలు దేరి ఆయా గ్రామాల మీదుగా విద్యార్థులను ఇళ్లకు చేర్చుతుంది. విద్యార్థుల సమస్యలను విన్నవించగా వెంటనే స్పందించి బస్సు ఏర్పాటు చేసిన డీఎం నాగేశ్వరరావుకు ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ విద్యార్థి సంఘం నాయకుడు రంగస్వామి, సిద్దయ్యగౌడు, విద్యార్థినీ విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు

జూపాడుబంగ్లా: అనుమతుల్లేకుండా అక్రమంగా ఎవరైనా మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవని నంద్యాల జిల్లా టాక్స్‌ఫోర్స్ ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ హెచ్చరించారు. విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం మండలంలోని మండ్లెం గ్రామంలో అక్రమ మద్యం విక్రయిస్తున్న వారి ఇళ్లపై దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన అశోక్ ఇంట్లో మూడురకాల కంపెనీలకు చెందిన 42 మద్యం సీసాలు లభించాయి. రామకృష్ణ ఇంట్లో సోదాలు నిర్వహించగా కర్ణాటక ఒర్జినల్ ఛాయిల్ టెట్రా ప్యాకెట్లు 46, తెలంగాణకు చెందిన ఇంపీరియల్ బ్లూ 3క్వాటర్ సీసాలు, 16 మ్యాక్‌డోల్ విస్కీ బాటిళ్లు, ఓల్డ్‌అడ్మిరియల్ 90ఎంఎల్ బాటిళ్లు 14, 26క్వార్టర్ బాటిళ్లు పట్టుబడ్డాయి. నిందితులు ఇద్దరు పరారైనట్లు ఎస్‌ఐ తెలిపారు. పట్టుబడిన మద్యం సీసాలను స్వాధీనంచేసుకొని వారి కుటుంబ సభ్యుల వద్ద నుంచి నిందితుల వివరాలు సేకరించుకొన్నారు. పట్టుబడిన మద్యం సీసాలను నందికొట్కూరు సెబ్ పోలీసుస్టేషన్‌లో అప్పగించారు. పరారైన నిందితులు ఇద్దరిపై కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేయనున్నట్లు తెలిపారు.


పట్టుబడిన మద్యం సీసాలతో డీటీఎఫ్ ఎస్‌ఐ

గుడిసెలను కాపాడండి

మహానంది: అబ్బీపురంలోని గిరిజనుల ఇళ్ల మధ్య కస్తూరిబా పాఠశాల వారు చెత్తాచెదారాన్ని వేసి కాల్చివేస్తున్నారని, దీంతో పేదల గుడిసెలకు ప్రమాదం పొంచి ఉందని గిరిజన సమాఖ్య కార్యదర్శి మోటా రాముడు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక కాలనీ వద్దకు చేరుకుని ఆందోళన చేశారు. ఆయన మాట్లాడుతూ ఇళ్ల మధ్య చెత్తాచెదారాన్ని వేయొద్దని ఎన్ని సార్లు విజ్ఞప్తి చేసినా వార్డెన్ పట్టించుకోవడం లేదన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు, స్థానిక గిరిజనులు పాల్గొన్నారు.

ఆదిత్యపుష్పం..!



మహానంది: ప్రకృతి అందాలు పర్యాటకులను కట్టిపడేస్తుంటాయి. ఎరుపెక్కిన ఆకాశం, నీలాకాశం అంటూ ఆకాశం అందాలపై ఎన్నో చిత్రాల్లో రచయితలు గేయాలు రాసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సంధ్య వేళ ఎరుపెక్కిన ఆదిత్యుడు ఓ చెట్టు కొమ్మకు పూసిన పుష్పంలా కొమ్మల మధ్య కొలువైన దృశ్యం మంగళవారం మహానందిలో కనిపించింది.

భక్తిశ్రద్ధలతో కుంభారాధనోత్సవాలు


ఆలయ కలశానికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

- పారుమంచాలలో నేడు శ్రీవెంకటేశ్వర స్వామివారి కల్యాణం
- తిరుమల–తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో వేడుకలు

జూపాడుబంగ్లా: మండలంలోని పారుమంచాల గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీవేణుగోపాల స్వామి ఆలయ ప్రతిష్ఠ వేడుకల్లో భాగంగా మంగళవారం భక్తిశ్రద్ధలతో నవకలశ, కుంభారాధనోత్సవాలు నిర్వహించారు. ఉదయం విశేషోక్త హోమాలు నిర్వహించి పూర్ణాహుతి ఇచ్చారు. సాయంత్రం వేళలో నవకలశ, చతుర్దశ, మహాశాంతి అభిషేకం, కుంభారాధన, శయనాధివాసం, అహోరాత్ర ప్రయోగం వంటి విశేషపూజలను తిరుమల–తిరుపతి దేవస్థానం అర్చకులు వేదమంత్రాల మధ్య నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించి మహామంగళహారతినిచ్చారు. కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

నేడు శ్రీవెంకటేశ్వరస్వామి కల్యాణం

ఆలయ ప్రతిష్ఠ వేడుకల్లో భాగంగా బుధవారం తిరుమల–తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో పారుమంచాల గ్రామంలో నేడు కలియుగ వైకుంఠనాథుడు శ్రీవెంకటేశ్వరస్వామివారి కల్యాణం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం 6గంటలకు పారుమంచాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు పాల్గొని స్వామివారి కృపాకటాక్షాలు పొందాలన్నారు.


వేణుగోపాలస్వామి విగ్రహానికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకుడు

క్షేత్రపాలకుడు, శనగలబసవన్నకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలోని శ్రీస్వామిఅమ్మవార్ల ఆలయప్రాంగణంలోని శనగన బసవన్నగా పేరు పొందిన నందీశ్వరునికి, శ్రీశైలక్షేత్ర పాలకుడిగా ప్రసిద్ధిగాంచిన శ్రీబయలువీరభద్ర స్వామి వారికి మంగళవారం సందర్భంగా శాస్త్రోక్తంగా ఈఓ ఎస్‌లవన్న, అర్చకులు విశేషపూజలను నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రదోషకాల సమయంలో క్షేత్రపాలకుడైన వీరభద్రునికి, నందీశ్వరునికి పంచామృతాలతో అభిషేకాది అర్చనలు చేపట్టారు. ఆరంభ పూజలలో భాగంగా లోకక్షేమాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. అనంతరం కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు గణపతి పూజను చేశారు. తరువాత నందీశ్వర స్వామికి నూతన వస్త్రసమర్పణ విశేషార్చనలను, నానపెట్టిన శనగలను, క్షేత్రపాలకునికి ప్రత్యేక నైవేద్యాన్ని సమర్పించి కర్పూరనీరాజనాలు అర్పించారు.


కుమారస్వామి

కుమారస్వామికి విశేషపూజలు

శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఈఓఎస్‌లవన్న, అర్చకులు విశేషక్రతువులను నిర్వహించారు. స్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్ర పారాయణలు చేశారు. అభిషేకంలో స్వామివారికి పంచామృతా లు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

అమ్మవారికి కొబ్బరికాయల సమర్పణ

శ్రీశైలంటెంపుల్: చైత్రమాసంలో పౌర్ణమి తర్వాత వచ్చే మంగళవారం, శుక్రవారం ఏ రోజు ముందు వస్తే ఆ రోజు శ్రీశైలశ్రీభ్రమరాంబాదేవికి కుంభోత్సవ జరపడం సంప్రదాయం. ఈ ఏడాది ఏప్రిల్ 11న అమ్మవారి కుంభోత్సవం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా మంగళవారం అమ్మవారికి కొబ్బరికాయలు సమర్పించారు. కార్యక్రమంలో ముందుగా అమ్మవారి ఆలయ ప్రదక్షిణ మండపంలో కొబ్బరికాయలను రాశిగా పోసి పసుపు, కుంకుమలతో పూజాధికాలు జరిపించారు. అనంతరం అమ్మవారికి కొబ్బరికాయలు సమర్పించారు.


అమ్మవారికి కొబ్బరికాయలను తీసుకెళ్తున్న ఉద్యోగులు

గోశాలకు ప్రత్యేక అధికారిని నియమించాలి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గో సంరక్షణ శాలకు అంకిత భావంతో విధులు నిర్వహించే ప్రత్యేక అధికారిని నియమించాలని హైందవ సంఘాల ఐక్యవేదిక సభ్యులు డిమాండ్ చేశారు. మంగళవారం శ్రీశైలంలో హైందవ సంఘాల ఐక్యవేదిక (హిందు జేఏసీ)అధ్యక్షులు లలిత్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కె.రవీందర్‌రెడ్డి, కోశాధికారి వేణుగోపాల్, హిందూ జనశక్తి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసయాదవ్ తదితరులు శ్రీశైల దేవస్థానం ఈఓ ఎస్ లవన్నను కలిసి పలు విషయాలపై చర్చించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఈఓకు అందజేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ శ్రీశైలదేవస్థానంలో నెలకొన్న సమస్యలు, గతంలో ఇచ్చిన హామీల అమలులో జాప్యం తదితర విషయాలపై దేవస్థానం ఈఓ లవన్నతో చర్చించామన్నారు. దేవస్థానంలో భక్తులకు గదులు, మరుగుదొడ్లు, తాగునీటి, వసతికేంద్రాలను మరిన్ని పెంచాలని కోరినట్లు తెలిపారు. గోశాలలో పశువైద్యులు, వెటర్నరీ అసిస్టెంట్ నియామకాన్ని వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు.


సెర్ప్ సీఈఓ ఇంతియాజ్ చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న ఏపీఎం అంబమ్మ

ఏపీఎం అంబమ్మకు అవార్డు

జూపాడుబంగ్లా: జూపాడుబంగ్లా ఏపీఎం అంబమ్మ ఉత్తమ ఏపీఎంగా సెర్ప్ సీఈఓ ఇంతియాజ్ చేతులమీదుగా అవార్డు అందుకుంది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని విజయవాడలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో సెర్ప్ సీఈఓ ఇంతియాజ్ ఆమెకు అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా ఆమెను కార్యాలయ సిబ్బంది, మండల మహిళా సమాఖ్య సిబ్బంది అభినందించారు.

మెనూకు అదనంగా మజ్జిగ అభినందనీయం

పగిడ్యాల: లాభాపేక్ష లేకుండా పిల్లలకు సేవా చేయాలన్న తలంపుతో వ్యయ ప్రయాసలకు లెక్క చేయకుండా మధ్యాహ్న భోజనంలో అదనంగా మజ్జిగ పంపిణీ చేస్తున్న వంట నిర్వాహకులను ఎంఈఓ సుభాన్ అభినందించారు. సాధారణ తనిఖీలో భాగంగా మంగళవారం స్థానిక దేవనగర్‌లోని మండల పరిషత్ స్పెషల్ పాఠశాల, బీరవోలు పాఠశాలలను తనిఖీ నిర్వహించారు. బీరవోలులో ఉదయాన్నే విద్యార్థులతో కలిసి ప్రార్థనలో పాల్గొన్నారు. అనంతరం స్పెషల్ పాఠశాలలోని మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. మెనూ ప్రకారం పులిహోర అన్నం, దొండకాయ చట్నీ తయారు చేసిన వంట నిర్వాహకులు అదనంగా పిల్లలకు మజ్జిగ తయారు చేసి ఇవ్వడాన్ని ఎంఈఓ ప్రశంసించారు. వేసవి కాలం బడులు పూర్తయ్యే వరకు పిల్లలకు మెనూతో పాటు మజ్జిగను అందిస్తామని వంట మహిళలు ఎంఈఓకు వివరించారు. అనంతరం ఎంఈఓ విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. హెచ్‌ఎం ప్రసాద్, శివరామయ్య, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.


విద్యార్థిని అభ్యసన సామర్థ్యాలను పరీక్షిస్తున్న ఎంఈఓ సుభాన్